పుస్తక ప్రపంచం

తెలుగు+ఇంగ్లీష్ ఇ-పక్ష పత్రిక | సంచిక: 1/1 | నవంబర్ 01-15 2024 | నిర్వహణ : ఫేస్‌బుక్ గ్రూప్

జీవితానికి దారులేసిన అక్షరాలు

పుస్తక ప్రపంచం పేరుతో గత 13 ఏళ్లుగా ఒక ఫేస్ బుక్ గ్రూప్ కొనసాగుతుండగా..అదే పేరుతో ఇలా ఒక పత్రిక అవసరమా..? అనే సందేహం చాలామందిలో కలగొచ్చు. అవును... ఇది చాలా అవసరం అనిపించే ఇలా ఆరంభిస్తున్నాము. ఎందుకంటే..? ఫేస్ బుక్, వాట్సాప్, ఇతర సోషల్ మీడియా గ్రూపుల్లో పుస్తకాలకు సంబంధించిన పోస్టులు చాలానే వస్తున్నాయి. అయితే ఒక కొత్త పోస్ట్ రాగానే అప్పటివరకూ ఉన్న తాజా పోస్ట్ మాజీ అయిపోతుంది. పుస్తకప్రేమికులైన పాఠకులు ఎన్ని గ్రూపులలో ఏఏ పోస్టులని గుర్తుపెట్టుకోగలరు? ఇవికాక వివిధ పత్రికల్లో వస్తున్న సమీక్షలు, పుస్తక పరిచయాలూ సరేసరి. అవి కూడా ఎన్నెన్నో ఉన్నాయి. ఇప్పటికే మన పుస్తక ప్రపంచం ఫేస్ బుక్ గ్రూప్ ద్వారా అందరితో ఎన్నో పుస్తకాల గురించిన సమాచారాన్ని పంచుకుంటున్నాము. అదే ఒక పత్రిక రూపంలో అయితే ఒక రికార్డుగా మరింత సౌలభ్యంగా ఉంటుందనే భావనతోనే ఈ ప్రయత్నం.

ప్రతి పదిహేను రోజులకు ఒకసారి ఈ పత్రిక ద్వారా రకరకాల పుస్తకాల సమీక్షలు, పరిచయాలు, తొలిపలుకులు, పరామర్శలు, ఆవిష్కరణలు, కొత్త పుస్తకాల విడుదలలు, పాతపుస్తకాల అనుభూతులు అన్నీ అందరితో పంచుకోవడానికి ఇదొక ప్రయత్నం. అంతేకాదు ప్రచురణకర్తలు, రచయితలు తాము ప్రచురించిన పుస్తకాల విశేషాలను దీనిద్వారా ఉచితంగా ప్రచారం చేసుకోవచ్చు. ఇక్కడ ఓ విషయాన్ని మాత్రం మర్చిపోకూడదు...ఈ పత్రికలో ప్రచురణ కోసం నేరుగా మీరు సమీక్షలు, పుస్తకాల పరిచయాలు వంటివి పంపించాల్సిన పనిలేదు. పుస్తక ప్రపంచం గ్రూప్ లోనే పోస్ట్ చేస్తే చాలు. ఇప్పటికే ఇందులో ఎనిమిది వేలకు పైగా పుస్తక ప్రేమికులైన నెటిజన్లు సభ్యులుగా ఉన్నారు. ఇంకా ఇందులో చేరకపోయిన వారు ఈ లింక్ ద్వారా గ్రూప్ లో చేరొచ్చు.

ఇదీ ఆ లింక్ **https://www.facebook.com/groups/147159992043965**

ఈ సత్ప్రయత్నాన్ని సహృదయతతో స్వీకరించి ఎల్లప్పుడూ సహకారం అందించగలరని కోరుతూ...

మీ

బెందాళం క్రిష్ణారావు (అడ్మిన్)

#పుస్తక_సమీక్ష

#నెమ్మినీలం_జయమోహన్

లోకాన్ని నడిపేది ధర్మం, అధర్మం అనే రెండు విషయాలు మాత్రమే

లోకాన్ని నడిపేది డబ్బు అనుకుంటాం మనం.. కాని లోకాన్ని నడిపేది ధర్మం, అధర్మం అనే రెండు విషయాలు మాత్రమే. అలా అని ధర్మాత్ములు, అధర్మాత్ములు అని ప్రత్యేకంగా ఎవరూ ఉండరు. అప్పటి వారి అవసరాలకు ఏదోక వైపు నిలబడతారు. జయమోహన్ రాసిన "నెమ్మినీలం" పుస్తకంలో అన్ని కథలు ధర్మం ఆధారంగా రాసినవే. తమిళ రచయిత జయామోహన్ నలభై రోజుల్లో ఇన్ని కథలు రాశాడు అంటేనే చాలా ఆశ్చర్యం వేసింది.



మొదటి కథ 'ధర్మం' లో తమిళంలో మొదటి తరం రచయితలు ఒక్కో నవల ఇరవై ముప్పై రూపాయలకే, ఎలాంటి హక్కులు లేకుండా రాశారని తెలిసి ఆశ్చర్యం వేసింది. రచయితల నోటి వాక్కులు ఫలిస్తాయి అనడం కూడా. రెండవ కథ 'ఒగ్గనివాడు'లో బ్రిటిష్ కాలంలో ఊర్లలో పన్ను వసూలు చేసే నాయర్ల అరాచకాలు, బానిసత్వం... తెలంగాణలో నిజాం కాలంలో జమిందారీ - వెట్టి చాకిరీ వ్యవస్థలను గుర్తుకు తెచ్చాయి. అక్కడ బ్రిటీష్ ప్రభుత్వ ఉద్యోగి వణంగాన్ కూడ నాయర్ల అవమానాలు పడి.. చివరికి నేసమణి సహాయంతో ఏనుగు మీద ఊరేగి.. నాయర్ల అరాచకాలను తొక్కి పడేస్తాడు. అచ్చం ఇక్కడి పీడిత ప్రజల వెనకాల నిలబడి గర్జించిన సంఘం లాగ.

అమ్మవారి పాదం

మూడవ కథ 'అమ్మవారి పాదం'లో సంగీతం ప్రాధాన్యంగా సాగుతుంది. అప్పటిదాకా శేషయ్యర్ సంగీతానికి పరవశించిపోతూ... చివర్లో ఆయన తండ్రి మంచంలో విసర్జించిన మలమూత్రంతో నిండిన పాన్.. ఇంటిపనుల్లో పడిపోయి తీయని భార్య నెత్తిమీద గుమ్మరించిన శేషయ్యర్ పాతాళంలోకి పడిపోయినట్టు అనిపిస్తుంది. ఒక్కోసారి మనం వీళ్లు గొప్పవాళ్ళు అనుకునే అసలు గొప్పతనం వాళ్ల భార్యల కన్నీళ్లు చూసి లెక్కెయ్యాలి.

ఏనుగుల డాక్టర్

నాలుగవ కథ "ఏనుగుల డాక్టర్'. ప్రకృతి అంటె ప్రతి ఒక్కరికీ ఇష్టమే. కాని ప్రకృతితో మమేకమయ్యే

వాళ్ళు అరుదు. ఉద్యోగరీత్యా అటవీశాఖలో వెటర్నరీ డాక్టర్ అయిన డాక్టర్ వి. కృష్ణమూర్తి గారి కథ ఇది. ఏనుగుల డాక్టర్‌గా పిలుస్తారు అంతా. ఈ కథలో అడవి గురించి.. ఏనుగుల గురించి వివరించడం బాగా నచ్చింది నాకు. ముందునుండి అడవిపై ఏనుగులపై ఉండిన ఇష్టం వల్ల ఇంకా ఎక్కువ నచ్చింది. ఏనుగులు అనేవి లేకుంటే సంగం సాహిత్యంలో ఏమీ ఉండదు..తగలబెట్టుకోవడం తప్పా అనడం ఎంత నిజమో.. అడవి లేకపోతే కూడ మనుషుల గురించి చెప్పుకునేది ఏమీ ఉండదు అనేది అంత నిజం.

కూటి ఋణం

ఇక ఐదవ కథ 'కూటి ఋణం'. ఎప్పుడైనా తిరువనంతపురం వెళితే కెత్తెల్ సాయిబు హోటల్ లో తినాలి కచ్చితంగా. ప్రస్తుతం సాయిబు లోకంలో లేకపోయినా... ఈ కథ చదివి ఉన్నాం కాబట్టి కెత్తేల్ సాయిబే స్వయంగా వడ్డిస్తున్నట్టు ఉంటది అనుకుంటున్న.

వంద కుర్చీలు

ఇక బుక్ లో ముఖ్యమైన కథ 'వంద కుర్చీలు'. ఈ పుస్తకానికి ఈ టైటిల్ పెట్టాల్సింది అనిపించింది. చదువుతున్నంతసేపూ గుండెను పచ్చటి గుమ్మడి ఆకు మీద తుమ్మ ముల్లుతో కసాబిసా తూట్లు గుచ్చుతున్న పెయిన్ తిప్పేస్తూ ఉంటుంది. ఇప్పుడే ప్రభుత్వ ఆసుపత్రుల్లో పరిస్థితి ఇలా ఉంటే ఓ అరవై ఏళ్ల కింద ఎలా ఉండి ఉంటుంది..? అందునా అనాథలకు, బిచ్చగాళ్ళకు, కింద కులాలు కూడా అంటరాని వాళ్ళుగా చూసే వాళ్ళ పరిస్థితి ఇంకెంత ఘోరంగా ఉండేదో.. తలుచుకుంటే ఒళ్లు జలదరించింది. ఇప్పటికీ మనం చూస్తున్న రోడ్డుపక్కన పడి ఉన్న అనాథలు.. బిచ్చగాళ్ల.. పరిస్థితుల్లో ఏం మార్పు లేదు అనిపిస్తుంది. ముసురు పట్టిన రోజు లేదా చలికాలం వచ్చే తుఫాను గాలులు వణికిస్తున్న రోజునో..వెచ్చటి రగ్గు కప్పుకుని పడుకున్నప్పుడు... వేడి వేడిగా సూపులు.. ఆహారం తింటున్నప్పుడు గుర్తుకు వస్తారు వీళ్లంతా. గుర్తుకు వచ్చి నొప్పితో మనసు మూలుగుతుండటమే నేను చేసేది.

పెద్ద ఉద్యోగిపైనా అంటరానితనం

కథలో మాత్రం... అరవై ఏళ్ల కింద ఉన్న అంటరానితనం.. అంటరాని కులాలుగా చెప్పబడుతున్న వాళ్ళు కూడా అసహ్యించుకున్న నాయాడి కులంలో పుట్టిన ధర్మపాలన్ అనే కాప్పన్.. చెత్త కుప్పల పక్కన పుట్టి, అక్కడ పడేసిన పాచిపోయిన బూజు పట్టిన ఆహారం కోసం పందులతో, ఎలుకలు, పందికొక్కులతో పోటీపడి తిన్న కాప్పన్ పడిన కష్టాలకు.. అసలు కష్టాలు, బాధలు అనే పేర్లకంటే ఎక్కువ వ్యక్తీకరించే పదాలు కనిపెట్టాలి వాటికోసం. అలాంటి కాప్పన్ కేవలం మంచి తిండి కోసం మాత్రమే థియొసాఫికల్ సొసైటీకి వచ్చి చేరి, చదువుకొని సివిల్స్ సాధిస్తాడు. అంత పెద్ద ఉద్యోగం సాధించాక కూడ అంటరానితనం కాప్పన్ మీద రుద్దబడుతూనే ఉంటుంది. రుద్దబడుతున్న అంటరానితనంతో జీవితాన్నే కోల్పోతాడు అమ్మతో సహా. తమ నాయాడి వాళ్ళను బయట పడేయడానికి తన అధికార కుర్చీలు వందకావాలి అనిపించింది కాప్పన్ కు అది అప్పటి కాలానికి, ఇప్పుడైతే లక్ష కుర్చీలు కూడ చాలవు. అయితే ధర్మపాలన్ గా మారిన కాప్పన్ ఏ అధర్మాన్ని ఎదురించినట్టు ఉండదు కానీ నిస్సహాయుడు, మరో అంటరాని కులానికి చెందిన ఆ ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుని విషయంలో అధర్మాన్ని గట్టిగా పాటిస్తాడు. అపుడు మన కన్నీళ్లు చేదు అవుతాయి.

యాత్ర, తాటాకు శిలువ

తరువాతి 7వ కథ 'యాత్ర'. వందకుర్చీల ఎఫెక్ట్ ఈ కథ మీద పడి.. తేలిపోయింది. అడుగు తీసి అడుగు వేయలేని స్థితిలో కూడ కోమల్ కైలాస పర్వతానికి చేసిన యాత్ర ఇది. 8వ కథ 'తాటాకు శిలువ'. కడుపుకు ఇంత గంజి పోయలేని మతాన్ని

వదులుకున్న కుటుంబం కథ. దేశం మొత్తం కలరా పట్టి జనం పిట్టల్లా రాలుతుంటే.. క్రైస్తవ మత సంస్థలు ప్రజలకు చేసిన సేవలు తెలుస్తాయి ఈ కథలో. అయితే దీని ముగింపు అర్థం కాలేదు నాకు.

నెమ్మి నీలం

9వ కథ 'నెమ్మి నీలం'. అమ్మవారి పాదం కథలో ఉన్న పాత్రలే ఇందులోనూ ఉంటాయి. కొత్తగా చంద్ర అనే నాట్యగత్తె ఉంటుంది. కళాకారులకు సాధారణంగానే ఉండే స్త్రీ సౌందర్య ఆరాధన ఇందులో కనిపిస్తుంది. అప్పటికాలం అయినా ఇప్పటికాలం అయినా స్త్రీ కళాకారుల పట్ల ఉండే చులకన భావం ఏం మారలేదు. సంగీత పరిజ్ఞానం ఉన్నవాళ్ళకి ఈ కథ అర్థమవచ్చు. ఇంతకీ నెమ్మి నీలం అంటే.. నెమలి మెడరంగు నీలం. చిత్ర కట్టుకున్న చీర రంగు.

చిలుకంబడు దధికైవడి

10వ కథ 'చిలుకంబడు దధికైవడి'. చల్ల చిలుకగా వచ్చిన వెన్న. జీవితాన్ని చిలుకగా వచ్చిన జ్ఞానం అనుకోవాలి కాబోలు. కంబ రామాయణ పద్యాలు జీవితానికి అన్వయిస్తూ ఈ కథ సాగుతుంది. "మనిషి జన్మ కంటే పెద్ద విషాదం ఉంటుందా? ప్రతి మనిషి జీవితం ఇంకో మనిషితో ముడిపడి ఉంటుంది.. శరీరానికి తగిలించబడ్డ కాళ్లు చేతుల్లా. మహాసముద్రం నుండి ఒక నీటి బొట్టు విడివడటాన్ని మనం వియోగం అంటాము." అనే వ్యాఖ్యలు నచ్చాయి.

పిచ్చిమాలోకం

11వ కథ 'పిచ్చిమాలోకం'. ఇది పూమేడై రామయ్య కథ. జీవితం మొత్తాన్ని సమాజానికి అది కూడా కాణి పైసా.. పేరు ఆశించకుండా బతికిన పూమేడై చివరి అంకం చాలా అధ్వానస్థితిలో ముగుస్తుంది. నిజమే కదా సమాజం బాగుకోసం బతికిన ప్రతి ఒక్కరూ చివరికి దిక్కూమొక్కు లేకుండా చావాలని శపించబడిన పుణ్యభూమి మనది.

ఎల్ల లోకములు ఒక్కటై

ఇక చివరి కథ 'ఎల్ల లోకములు ఒక్కటై'... ఆ దేశం ఈ దేశం.. ఇవి మా హద్దులు అవి మీ హద్దులు అనేవి కాలరాసి ప్రపంచం అంతా "ఒనే వోర్ల్డ్, ఒనె నతిఒన్" ఉండాలని సంకల్పించిన గ్యారీ డేవిస్, నటరాజగురుల గురించి తెలుస్తుంది మనకి. ఆ నినాదం కోసం గ్యారీ సాగించిన ప్రపంచ యాత్ర, పడిన కష్టాలు తెలుస్తాయి కానీ గుండెను మెలిపెట్టేంత బాధ కలిగించవు.

40 రోజుల్లో డజను కథలు

తమిళ రచయిత జయామోహన్ నలభై రోజుల్లో ఇన్ని కథలు రాశాడు అంటేనే చాలా ఆశ్చర్యం వేసింది. కాని కొన్ని కథలు మాత్రమే మెప్పించాయి. 'వంద కుర్చీలు', 'కూటి ఋణం', 'ఏనుగుల డాక్టర్', 'పిచ్చి మాలోకం' కథలు బాగున్నాయి. అయితే అన్ని కథల్లో తమిళ పేర్లు, ప్రాంతాల పేర్లు రావడం గజిబిజిగా అనిపిస్తుంది. మనకు మొదట్లో చెప్పినట్టు ధర్మం ఆధారంగా సాగే కథలు అనిపించినా.. కొన్ని కథల్లో ధర్మాన్ని మీరుతాడు. కూటి ఋణం కథలో ధర్మం ప్రకారం.. చేసిన తప్పులకు కాలం శిక్ష విధిస్తుంది. మరి ఆ శిక్షను అనుభవించకుండానే రామలక్ష్మిని పెళ్లి చేసుకొని.. ధర్మం వేసిన శిక్షను తప్పించడం అంటే ధర్మాన్ని మీరినట్టే కదా. వంద కుర్చీల్లో కూడా. తాను కులం వలన తన ప్రమేయం లేకుండానే తొక్కి వేయబడ్డట్టు.. కాప్పన్ డాక్టర్ పట్ల అలాగే కర్కశంగా ప్రవర్తిస్తాడు. ధర్మం ఆధారంగా అయితే.. జీవితాంతం ధర్మంగా బతికిన పూమేడై చివరికి ఆసుపత్రి మెట్ల మీద ఎందుకు కుక్క చావు చావాలి మరి.

'ఏనుగుల డాక్టర్' కథ మాత్రం చాలా ప్రత్యేకం. నేను గాంధారి ఖిల్లా దగ్గర చూశాను... వారాంతాల్లో విందు చేసుకోవడానికి అక్కడికి వచ్చి మద్యం తాగి ఆ సీసాలు పగలగొట్టడం. ఖచ్చితంగా రాత్రి అక్కడ తిరుగాడే అడవి జంతువుల కాళ్ళల్లో గుచ్చుకోవడం జరిగే ఉంటుంది. కథలో ఏనుగుల పరిస్థితి బయట జరుగుతున్నవి కళ్ళకి కట్టినట్టు కనబడతాయి. అక్కడక్కడా గుర్రాలను, ఒంటెలను, ఏనుగులను మనుషులు సరదాగ ఎక్కించి తిప్పే యంత్రాల్లా వాడతారు. వాటికి తిండి ఉండదు, బక్కచిక్కి ఎముకలు బయటికి కనిపిస్తూ ఉంటాయి. వాటి స్వేచ్ఛకు.. బయట వాటితో పదీ పరకకి చేయించే పనులు.. కాసేపు విషాదం మన నెత్తి మీద విలయతాండవం చేసినా.. మనమేం చేయలేం కాబట్టి తర్వాత మర్చిపోతాం. పేజీలు ఎక్కువ ఉన్నాయని పుస్తకానికి ఎక్కువ డబ్బులు పెట్టినట్టు ఉన్నరు. దానికి బదులు కథలు అలాంటివి అని చెప్పాల్సింది. మరిన్ని పుస్తకాలు మీ సంస్థ నుంచి రావాలని "ఛాయ" పబ్లికేషన్ వారిని కోరుకుంటూ...

✍- రాజీ కన్నా

ఏనుగులు, జంతువుల భాష తెలిస్తే...

(కాపీ కోసం 094900 98654 కు రూ 450/ ఫోన్ పే చేసి స్క్రీన్ షాట్, అడ్రస్ వాట్స్ అప్ చేయండి)



#పుస్తక_పరిచయం

గిడుగు పునర్దర్శనం...

గిడుగు సవరభాషకు తొలి అడుగు
గిడుగు తెలుగు వ్యవహార భాషకు ముందడుగు
గిడుగు కార్యాచరణలో పిడుగు
గిడుగు అంటే శ్రీకాకుళం భాషలో గొడుగు
గిడుగు అయ్యాడు తెలుగు సవరభాషలకు గొడుగు.

2018 లో నేను మా సవర గిరిజనులపై పరిశోధనలో భాగంగా ఆంధ్ర యూనివర్సిటీ గ్రంథాలయాన్ని సందర్శించాను. గిరిజనులకు ముఖ్యంగా సవరలకు సంబంధించిన M.Phil, Ph.D. పరిశోధన గ్రంథాలను పరిశీలించాను. అప్పుడే డాక్టర్ అల్లంసెట్టి చంద్రశేఖర రావు గారి A Descriptive Grammar of Sora Languag చదివాను. బంగారు పతకం సాధించిన గొప్ప పరిశోధన గ్రంథం అది. వారు తన పరిశోధనలో సవర భాషలోని మాండలిక వైవిధ్యాన్ని గుర్తించారు. సవర భాషలోను కంఠమూలీయ అవరోధం, మరియు అవరోధిత హల్లుల ధ్వని విశేషాలను, వాని ప్రయోగాలను పేర్కొన్నారు. డాక్టర్ అల్లంసెట్టి చంద్రశేఖర రావుగారి పరిశోధన గ్రంధం Savara Grammar (A Tagmemic grammar) అన్న పేరుతో 2010లో అచ్చు అయింది.



డాక్టర్ అల్లంసెట్టి చంద్రశేఖర రావుగారి అడ్రస్ కనుక్కొని శ్రీకాకుళం జిల్లా పొందూరు వెళ్ళాను ము ఒక రోజంతా వారి గృహంలో గడిపాను. 30 సంవత్సరాలకు పైగా వారు సవరభాషపై చేసిన పరిశోధనను వివరించారు. సవర భాష అభివృద్ధికి అతను చేస్తున్న కృషి చాల గొప్పది. సవర గిరిజనుల చరిత్ర, సంస్కృతిని వివరించారు. సవర భాషకు సంబంధించి రచయిత అనేక పుస్తకాలు, వ్యాసాలు ఇచ్చారు. చక్కని ఆతిథ్యాన్ని ఇచ్చినందుకు వారి కృతజ్ఞతలు. అల్లంవారు కేవలం 'రచయిత' మాత్రమే కాదు చక్కని 'చిత్రకారుడు కూడ.

మొదటిసారి ఓ పుస్తకానికి అభిప్రాయం రాయడం చేత, అందులోనూ బహుముఖ ప్రజ్ఞావంతుడైన గిడుగువారి గురించిన పుస్తకంపై నా అభిప్రాయం రాయడానికి చాలా భయపడ్డాను. రచయిత డాక్టర్ అల్లంసెట్టి చంద్రశేఖర

రావుగారు అనేక సార్లు ఫోన్ చేసినప్పటికీ తప్పించుకొనే ప్రయత్నం చేశాను. కాని, అతని పట్టువదలని ఫోన్ కాల్స్ వల్ల చివరికి భయం భయంగానే నా అభిప్రాయాన్ని రాసి పంపుతున్నాను.

డాక్టర్ అల్లంసెట్టి చంద్రశేఖర రావుగారు 'గిడుగు' దర్శనం' అద్భుతంగా, సోదాహరణంగా రచించిన తీరు ఇతర రచయితలకు మార్గదర్శకం. సవర భాష

వ్యాకరణంపై రావు సాహిబ్ జి. వి. రామమూర్తిగారి తర్వాత పరిశోధన చేసి, ఆయనలాగే సవరభాష అభివృద్ధిని కృషి చేస్తున్న డాక్టర్ అల్లంసెట్టి చంద్రశేఖర రావుగారిని 'మరో గిడుగు' అనడం అతిశయోక్తి కాదు. రచయిత ఇంటి పేరులో 'అల్లం' ఉంది. కాని అతను రాసిన ఈ పుస్తకంలోని తెలుగుభాష అంతటా 'బెల్లం' ఉంది. తెలుగు భాష మాధుర్యం ప్రతి అక్షరంలో, వాక్యంలో తగులుతుంది. సవర గిరిజనుల భాషను,

సంస్కృతిని ప్రపంచానికి పరిచయం చేసి, వారి అభివృద్ధికి కృషిచేసిన రామమూర్తిగారి గురించి రాసిన ఈ 'గిడుగు దర్శనం' గూర్చి అదే సవర తెగకు చెందిన నేను అభిప్రాయం రాయడం రావు సాహిబ్ జి. వి. రామమూర్తిగారికి అక్షర నివాళిగా భావిస్తున్నాను. ఈ మహత్తర పుస్తకంపై అభిప్రాయం రాసే అవకాశం కల్పించిన డాక్టర్ అల్లంసెట్టి చంద్రశేఖరరావు గారికి మా సవర జాతి తరపున నమస్కారములు, మరియు కృతజ్ఞతలు.

గిడుగు రామమూర్తి గారి గూర్చి, అతను చేపట్టిన సవర భాషా అధ్యయనం గూర్చి వ్యావహారిక తెలుగుభాషా ఉద్యమం గూర్చి సమగ్రంగా రాయబడిన పుస్తకం ఇది. ఇంతవరకు గిడుగువారిపై వచ్చిన వ్యాసాలు, రచనలు ఒక ఎత్తు, ఈ పుస్తకం ఒక ఎత్తు. అల్లంసెట్టివారు తెలుగుభాషా పండితులు అవడం వలన సవరభాషా వ్యాకరణంపై గిడుగువారి బాటలో పరిశోధన చేయడం వలన గిడుగువారి ఆత్మను పట్టుకొన్నారు. ముఖ్యంగా సవర భాషకు గిడుగువారు చేసిన పరిశోధన వివరించడం ద్వారా, గిడుగువారి అంతరంగాన్ని ఆవిష్కరించే ప్రయత్నం చేశారు. పుస్తకం పేరుకు అన్నట్టుగానే ఈ గ్రంథం చదవడం ద్వారా సంపూర్ణంగా గిడుగువారి దర్శనం కలుగుతుంది.

గిడుగువారు శాసన పరిశోధలో అద్భుతమైన కృషి చేశారు. ఆ విధంగా కళింగదేశ చరిత్ర రచనకు ఆధార సామగ్రిని సమకూర్చిన ఆధునిక పరిశోధకులలో గిడుగువారు అగ్రగణ్యులని రచయిత సోదాహరణంగా వివరించారు.

అమాయకులైన సవరలు సంతల్లో వ్యాపారుల చేతుల్లో మోసపోతున్న తీరు చూసి గిడుగువారు కలత చెందారు. వారిని ఎలాగైనా ఉద్ధరించాలని, వారి మాతృభాషటో విద్యావంతులను చేయాలని ముందుగా సవర భాష నేర్చుకొని, తదనంతరం సవర వ్యాకరణం తయారు చేశారని రచయిత వివరించారు.

రామమూర్తిగారు మానవత్వంతో సవర గిరిజనులకు పాఠశాలలు స్థాపించి వారి మాతృభాషలోనే విద్యా బోధన చేసి, వారిని జన జీవన స్రవంతిలోకి తెచ్చేందు తమ పూర్తి జీవితాన్ని అంకితం చేసినట్లుగా రచయిత మొదటి అధ్యాయంలో పేర్కొన్నారు.

రెండవ అధ్యాయంలో సవరలు భారత దేశపు ఆదివాసులని అల్లంసెట్టివారు. పేర్కొన్నారు. సవరల ప్రాచీన చరిత్ర గురించి అనేక గ్రంథాలలోని ఆధారాలతో వివరించారు.

గిడుగువారు తన జీవితకాలం పరిశోధించి సవరభాషకి రాసిన A Manual of Sora Language లోని వాక్యాలను, పదాలను రచయిత వ్యాకరణ యుక్తంగా వివరించారు. తన పరిశోధనలు అందరికీ అర్థమయ్యేలా ఆ గ్రంధాన్ని అంతర్జాతీయ ధ్వనిలిపి (ఫొనెటిక్ స్క్రిప్ట్) లో రాయడంలో ఉన్న ఉద్దేశం ఆ భాషను స్వచ్ఛంగా అలాగే కొనసాగించి ఇతర భాషా పదాలతో సంకరం కాకుండా ప్రయత్నించడం, భాష స్వచ్ఛతను అలాగే కాపాడడం. ముఖ్యంగా తెలుగు ప్రభావం పడకుండా జాగ్రత్తపడ్డారు. లిపి ధ్వని విధేయంగా ఉండాలన్నది రామమూర్తిగారి అభిప్రాయం అని రచయిత పేర్కొన్నారు. సవర విద్యార్థులు ధ్వనిలిపి నేర్చుకొంటే తెలుగువారు శంకరనారాయణ ఇంగ్లీష్ తెలుగు నిఘంటువును ఉపయోగించుకొన్నట్లే, సవరలు రామమూర్తిగారు రాసిన ఇంగ్లీష్ సవర నిఘంటువు ఉపయోగించుకోవచ్చు.



మూడవ అధ్యాయంలో తెలుగులో వ్యావహారిక భాషోద్యమం గురించి వివరంగా రాశారు. నాలుగో అధ్యాయంలో సవర పిల్లలకు వారి మాతృభాషలో చదువు నేర్పే ఉపాధ్యాయుల కోసం గిడుగువారు సవర వాచకాలను తెలుగు లిపి ఉపయోగించి రాసినట్లు రచయిత పేర్కొన్నారు. ఆ వాచకాలకు తెలుగు అనువాదాలను కూడ గిడుగువారు రాశారు. ఆ వాచకాలు కూడ విద్యార్థుల వయసుకు తగ్గట్టు రూపొందించడంలో గిడుగువారి ప్రజ్ఞ దాగి వుంది. ఆ వాచకాలలో దాదాపు అన్ని సవర కథలు సవరలు గిడుగువారికి చెప్పినవే. అవి వాళ్ల మాటల్లోనే రాయబడ్డాయి. ఈ కథల ద్వారా సవరల జీవన విధానం, ఆచారాలు, విజ్ఞానం, సంస్కృతి తెలుస్తాయి.

ఈ అధ్యాయంలోనే గిడుగువారు సవరభాషకు ఆదికవి, సవర సాహిత్య చరిత్ర వారితోనే ప్రారంభించాలని రావుగారు చెప్పారు. సవరభాషలో రామమూర్తిగారు రాసిన రెండు పాటలను రచయిత డాక్టర్ అల్లంసెట్టి చంద్రశేఖర రావుగారు అద్భుతంగా అనువాదం చేశారు.

ముఖ్యంగా పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను తెలియజేస్తూ శతాబ్దము క్రిందట రామమూర్తిగారు రాసిన 'గు-అరి-నేబజ్ జి' (చెట్లు రోదిస్తున్నాయి) అనే పాటలో తమను నరికితే పర్యావరణానికి కలిగే నష్టాన్ని చెట్లు వివరించినట్లు రాయడం కవియొక్క - గొప్ప భావుతకు నిదర్శనం.

రామమూర్తిగారు సవరభాషకు మూడు నిఘంటువులు రాశారని పేర్కొన్నారు. 1. తెలుగు - సవర నిఘంటువు, 2. ఇంగ్లీషు - సవర నిఘంటువు, 3. సవర - ఇంగ్లీషు నిఘంటువు. తెలుగు సవర నిఘంటువులో ఒకే తెలుగు పదానికి అనేక సమానార్థక సవర పదాలను రాసి అర్థభేదాలను తెలియజేసిన తీరు చాలా బాగుంది.

బహుభాషావేత్తగా, నిఘంటు నిర్మాణకర్తగా చరిత్రకారునిగా, బహుముఖ ప్రజ్ఞను చాటిన గిడుగువారు నిజంగా చిచ్చర పిడుగే, ఇటు సవరభాషకు సూర్యునిగా, అటు తెలుగుభాషకు చంద్రునిగా ద్విపాత్రాభినయం చేస్తూనే, రెండుభాషలకు అద్వితీయమైన సేవలను అందించారు. ఈ 'గిడుగు దర్శనం' అనే రచనద్వారా గిడుగును పునర్దర్శనం చేసినట్లయింది.

గిడుగు రామమూర్తిగారిపై తెలుగు వ్యావహారిక భాషా ఉద్యమంపై, ముఖ్యంగా సవరభాషపై అధ్యయనం చేసేవారికి ఈ పుస్తకం ఎంతగానో ఉపయోగపడుతుంది.

- సవర గణపతి రావు
అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ హిస్టరీ,
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, గజ్వేల్.
తెలంగాణ రాష్ట్రం.

#పోటెత్తిన_కెరటం..

నియంతృత్వాన్ని వెటకరించిన నవల..

గీతా హరిహరన్ ఇంగ్లీషులో రాసిన "I have become the Tide" నవలని "పోటెత్తిన కెరటాన్ని" పేరుతో ఓల్గా తెలుగులోకి అనువాదం చేసారు. మలుపు బాల్ రెడ్డి ఈ పుస్తకాన్ని ప్రచురించారు. యుగయుగాలుగా దళిత జీవితాల్లోని కుల వివక్ష, అసమానతల గురించి చాలా ప్రభావంతంగా గీత ఈ నవలలో చిత్రించారు. ఈ నవలలో మూడు పాయల భిన్నమైన జీవితాల గురించి ఆమె వర్ణించారు. పశువుల చర్మాలను వొలిచి బతికే తండ్రి, అతని కొడుకు చిక్క, అతని జీవిత పోరాటం, ఆనంద గ్రామానికి పెద్దన్న ద్వారా చేరటం అతని భార్య మహాదేవి, కొడుకు కన్నప్పల జీవితాల చిత్రణ మొదటి పాయ.
రెండో పాయలో దళిత విద్యార్థులు ఆషా,రవి, సత్యాలు మెడికల్ కాలేజీలో చదవాలనే కోరికలు తుంచేయబడి, ఒక సత్య మాత్రమే వైద్య విద్యలో చేరినా ఆధిపత్య కులాల అణిచివేత, అవమానాల నేపథ్యంలో ఆత్మహత్య చేసుకుని చనిపోతాడు. ఆషా రవి హతాసులవుతారు. పోటెత్తే కెరటాలౌతారు.
మూడో పాయలో ప్రొఫెసర్ కృష్ణ జీవితం, అతని పరిశోధనలు. ప్రాచీన యోగి కన్న దేవుడు గురించిన పరిశోధన ద్వారా వెల్లడించిన సత్యాలు హిందుత్వ వాదుల ఆగ్రహానికి గుర్తై, వారి తుపాకీ గుళ్ళకు బలైపోతాడు.
ఈ మూడు కథలు విడివిడిగా అనిపించినా వాటిని కలిపే మూల సూత్రం మాత్రం ధిక్కారం. యుగయుగాల కుల వివక్ష, అంటరానితనం, అసమానతల మీద పోటెత్తిన కెరటం.



"ఆ నేల ఎక్కడుంది?
నీరు స్వేచ్ఛగా పారే చోటు ఎక్కడుంది?
నాకు చెప్పండి నాకు చెప్పండి
నా నేల ఎక్కడుంది?
నీళ్లు స్వేచ్ఛగా పారే ఆ చోటు ఎక్కడుంది"

చిక్కడి తండ్రి డప్పు కొట్టుకుంటూ పాడే ఈ పాట నవలకి ఆయువుపట్టు లాంటిది.
నవల చదువుతున్నంత సేపు సమకాలీన అంశాలు ఎన్నో కళ్ళముందు మెదులుతాయి.
ధిక్కార స్వరాలు రోహిత్ వేముల, కల్బుర్గి, పన్సాలే, గౌరీ లంకేష్ ను గుర్తుకు వస్తారు.
హిందుత్వవాదుల తుపాకీ గుళ్ళకు బలైపోయిన ఎందరో గుర్తొచ్చి మనసులో తీవ్ర దుఃఖం కలుగుతుంది.అత్యంత విలువైన వ్యక్తుల బలిదానాలు కళ్ళ ముందుకు వస్తాయి.
చివరగా ఈ నవలలో గీత ప్రస్తావించిన కులాతీత, మతాతీత,వర్గాతీత,ప్రాంతాతీత ఆనంద గ్రామం. ఆనంద గ్రామంలో ఎలాంటి వివక్ష కులాధిపత్యం, కులాహంకారం లేని సమ సమాజ ఆకాంక్ష .
ఆనంద గ్రామం గురించి చదవడం చాలా ఆనందాన్నిస్తుంది. చదవండి. తప్పకుండా చదవాల్సిన నవల. ఓల్గా అనువాదం సరళంగా ఉంది. పోటెత్తిన కెరటాన్ని పేరు బాగుంది.

#పోటెత్తిన_కెరటం..

రచన - గీతా హరిహరన్ అనువాదం - ఓల్గా

#ధర_275రూ #కాపీ_కోసం 094900 98654

గ్రంథాలయాలు జ్ఞానదీపికలు

*** నవంబర్ 14 నుండి 20 వరకు గ్రంథాలయ వారోత్సవాలు**

ప్రజలను విజ్ఞానవంతులను చేసి చైతన్యవంతులను చేసేందుకు గ్రంథాలయాలు తోడ్పడతాయి. గ్రంథాలయోద్యమ పితామహునిగా పేరొందిన అయ్యంకి వెంకటరమణయ్య గ్రంథాలయాల కోసం ఉద్యమాన్ని ప్రారంభించారు. గ్రంథాలయోద్యమం ప్రజలను చైతన్యవంతుల్ని చేయడం ద్వారా భారత స్వాతంత్ర్య, తెలంగాణా సాయుధ పోరాటం ఉద్యమాలలో భాగం వహించింది.

ఆధునిక పద్ధతుల్లో ఆంధ్ర ప్రదేశ్ లో ఏర్పాటైన తొలి గ్రంథాలయం విశాఖపట్టణంలో ఏర్పాటుచేశారని పరిశోధకులు భావిస్తున్నారు. 1886లో విశాఖపట్టణంలో మంతిన సూర్యనారాయణమూర్తి ఈ పౌరగ్రంథాలయాన్ని నెలకొల్పారు. ఆంగ్లభాషా సంస్కృతుల ప్రభావం, ఇతర దేశాల్లోని గ్రంథాలయాల గురించిన సమాచారం ప్రజలకు లేకపోయినా స్వంత ప్రేరణపై ఆయన గ్రంథాలయాన్ని ప్రారంభించారు. ఇలా ఆసక్తి ఉత్సాహంతో ఆంధ్రదేశమంతటా (బళ్ళారితో కలుపుకుని) 1905 నాటికి 20 గ్రంథాలయాలు స్థాపించబడినట్లు లెక్కకువచ్చాయి. పలు ఉద్యమాలు, సాహిత్య సృష్టి వంటి కారణాలతో 1913 నాటికి వీటి సంఖ్య 123కు పెరిగింది. ఆపైన గ్రంథాలయోద్యమం ప్రారంభమై ఇతర ఉద్యమాలకు చేయూతనివ్వడమే కాక పలు రంగాల్లో తెలుగువారి చైతన్యానికి చేయూతనిచ్చింది

1911లో రామమోహన గ్రంథాలయాన్ని అయ్యంకి వెంకటరమణయ్య స్థాపించారు. ఆయన 1914లో విజయవాడ ఆంధ్రదేశ గ్రంథ భాండాగార

ప్రతినిధులతో గ్రంథాలయ మహాసభలు నిర్వహించారు. 1915లో భారతదేశంలోని తొలి గ్రంథాలయ సంఘాన్ని ఏర్పాటు చేశారు. సంఘం తరఫున ఇండియన్ లైబ్రరీ జర్నల్ను ప్రారంభించారు. ఊరూరా గ్రంథాలయాలు ఏర్పాటుచేయడం, ప్రజలకు అక్షరజ్ఞానం కల్పించడం వంటివి ఇందులో భాగం. పశ్చిమగోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల గ్రంథాలయ సంఘాల కార్యదర్శులు 1934-1948 మధ్యకాలంలో గ్రంథాలయ యాత్రలను నిర్వహించారు. ఈ క్రమంలో కొత్త గ్రంథాలయాలను ప్రారంభించారు. మూసివేయబడిన గ్రంథాలయాలు ఎన్నో పునరుద్ధరించారు. 1920, 1934ల్లో గ్రంథాలయ కార్యదర్శులకు శిక్షణ తరగతులను నిర్వహించారు. ఉద్యమనిర్వహణలో భాగంగా గ్రంథాలయ సంఘాల ప్రతినిధులు ఆంధ్రదేశంలోని ప్రతి గ్రామంలోనూ పర్యటించారు.

1914లో ప్రారంభమైన గ్రంథాలయ మహాసభలు రాష్ట్రంలోని గ్రంథాలయాల అభివృద్ధికి, గ్రంథాలయోద్యమ రూపకల్పనకూ చేయూతనిచ్చాయి. మొదటి గ్రంథాలయ మహాసభలు 1914 ఏప్రిల్ 10న విజయవాడలో రామమోహన ధర్మపుస్తకభాండాగారం ప్రతినిధుల ఆధ్వర్యంలో జరిగాయి. ఈ మహాసభలకు ప్రముఖ కవి చిలకమర్తి లక్ష్మీనరసింహం అధ్యక్షత వహించారు. అప్పటికే రాష్ట్రంలోని గంజాం, విశాఖపట్టణం, గోదావరి జిల్లా, కృష్ణా జిల్లా, నెల్లూరు ప్రాంతం, కడప, కర్నూలు మొదలుకొని బళ్ళారి వరకూ ఏర్పాటైన 60 గ్రంథాలయాల నుంచి 200 మంది ప్రతినిధులు కార్యక్రమానికి విచ్చేశారు. మొదటి గ్రంథాలయ మహాసభల సందర్భంగా ఆంధ్రదేశ గ్రంథ భాండాగార సంఘం ఏర్పాటుచేశారు.

1918 సంవత్సరం లో భారత జాతీయ వైజ్ఞానిక మంత్రిత్వ శాఖవారు జాతీయ గ్రంథాలయ సదస్సును లాహోర్‌లో నిర్వహించారు. అప్పటికే రెండు తెలుగు రాష్ట్రాలలో గ్రంథాలయ ఉద్యమం ఊపు అందుకుంది. ఈ కార్యక్రమానికి ఆంధ్ర దేశం నుండి గ్రంథ పాలకులు, గ్రంథాలయ ఉద్యమకారులు పాల్గొనదలిచారు. కానీ బ్రిటిష్ ప్రభుత్వం వారిని అనుమతించలేదు. ఆ మరుసటి సంవత్సరం 1919లో మద్రాస్ లోని గోకలే హాల్ నందు పద్మశ్రీ అయ్యంకి వెంకటరమణయ్య రెండు రోజులపాటు నవంబర్ 14, 15 తేదీలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బరోడా సంస్థానం నుండి కుడాల్కర్ అనే గ్రంధాలయ అధికారి అధ్యక్షులుగా వ్యవహరించారు. 1968లో భారత ప్రభుత్వం శ చక్రవర్తి గారి అభ్యర్ధన మేరకు గ్రంథాలయాలకు జాతీయ వ్యాప్తంగా వారోత్సవాలు నిర్వహించాలని తీర్మానించారు. తెలుగువారు విజయవంతంగా నిర్వహించిన తొలి జాతీయ సదస్సు జరిగిన తేదీల నుండి జాతీయ గ్రంథాలయ దినోత్సవం గా ప్రక టించారు.

గ్రంథాలయ వారోత్సవాలు (వారం రోజులపాటు) నవంబర్ 14 నుండి 20వ తారీకు వరకు అన్ని పౌర, అకాడమిక్, స్పెషల్ గ్రంథాలయాలలో ఘనంగా దేశ వ్యాప్తంగా నిర్వహిస్తారు. ఈ వారం రోజులపాటు గ్రంథాలయలలో ఏమేమి కార్యక్రమాలు నిర్వహిస్తారు అనే విషయాలను చర్చించినట్లైతే ముఖ్యంగా గ్రంథాలయాలలోని కొత్త పుస్తకాలు, ప్రాముఖ్యత గల పుస్తకాలు, రీడింగ్ డిమాండ్ ఉన్నటువంటి పుస్తకాలన్నింటినీ ప్రదర్శన నిర్వహించి విద్యార్థులను, పెద్దలను, మహిళలను, ఒక్కరేమిటి ఆబాల గోపాలాన్ని గ్రంథాలయాలకు ఆకర్షించే ప్రయత్నం చేస్తారు. అదేవిధంగా విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్, కవితలు, వక్తృత్వం... ఇలా అనేక రంగాల్లో పోటీలు, బుక్ రివ్యూస్ కార్యక్రమాలు ఏర్పాటు చేసి చదువరులను ఎక్కువగా ఈ వారోత్సవాలలో పాల్గొనేలా ప్రయత్నం చేస్తారు.

***

పుస్తక సమీక్ష

మరల నిదేల " అమెరికా ముచ్చట్లు" యన్నచో..

- కె.పి. అశోక్ కుమార్

అమెరికా అంటే భూతల స్వర్గం గా భావించే రోజుల్లో, అమెరికాను సందర్శించిన చాలామంది అక్కడి వింతలు- విశేషాలను తెలియజేసే ఉద్దేశంతో , వారి అమెరికా అనుభవాలను పుస్తకాలుగా తీసుకువచ్చారు. అంతకు ముందు అమెరికా పర్యటనల మీద పుస్తకాలు వచ్చినప్పటికీ, అక్కినేని నాగేశ్వరరావు రాసిన " నేను చూసిన అమెరికా" (1963) పుస్తకంతో, ఆ తర్వాత వచ్చిన ట్రావెలాగ్ లన్నీ చదవడం జరిగింది. ఇందులో కొన్ని కథల రూపంలో, కొన్ని కవిత్వ రూపంలో, చివరికి నానీల రూపంలో కూడా వచ్చాయి. అక్కడి వింతలు- విశేషాలను సమాచారాత్మకంగా, విజ్ఞానాత్మకంగా తెలియజేసే ట్రావెలాగ్ లు చాలా తక్కువగానే వచ్చాయి. ఇప్పుడు వచ్చిన శ్రీధర్ రావు దేశ్ పాండే " అమెరికా ముచ్చట్లు" ఆకోవలోకే చేరిపోతుంది.



శ్రీధర్ రావు దేశ్ పాండే, డాక్టర్ భారతి దంపతుల ఇద్దరు బిడ్డలు అమెరికాలో చదువుకొని అక్కడే ఉద్యోగాల్లో స్థిరపడటం వలన, వారిని చూడటానికి ముందుగా డాక్టర్ భారతి, ఉద్యోగ బాధ్యతల్లో సెలవు దొరకక శ్రీధర్ తర్వాత వెళ్లడం జరిగింది. హైదరాబాద్ లో విమానమెక్కిన శ్రీధర్ దుబాయ్ లో మారి, ఇంకో విమానమెక్కి అమెరికా చేరుకోవడం లో తన ప్రయాణ విశేషాలను పూసగుచ్చినట్లుగా వివరించారు.

కొత్తగా భారత్ నుంచి అమెరికా వచ్చే వాళ్లకు ఇక్కడి పద్ధతులు అలవాటు కావాలంటే కొంతకాలం పడుతుంది. ఎందుకంటే ఇక్కడివన్నీ ఉల్టా పుల్టా పద్ధతులు అంటూ ఎలక్ట్రిక్ స్విచ్ లు, పెట్రోలు కొలతలు, దూరాల కొలతలు, డ్రైవింగ్, ఇళ్ల నిర్మాణాలలో గమనించిన విశేషాలను తెలియజేశారు. అమెరికాలో ఎండాకాలంలో సూర్యాస్తమయం ఎందుకు ఆలస్యం అవుతుందో శాస్త్రీయంగా వివరించిన తీరు ఆకట్టుకుంటుంది. కొలరాడో నదీ లోయలో 50, 60 లక్షల సంవత్సరాల క్రితం అద్భుతమైన ఎర్రరాళ్లతో నిర్మితమైన గ్రాండ్ కాన్యాన్ పర్వత శ్రేణుల గురించి వివరించారు. హాలీవుడ్ సినిమాలను రెగ్యులర్గా చూసేవారు వీటిని సులభంగా గుర్తించగలుగుతారు. తర్వాత డాలస్ డౌన్ టౌన్ లో విన్సెంట్ వాంగో చిత్ర ప్రదర్శనను తిలకించారు. అమెరికాలో రైతుబజార్ల ఏర్పాటు- ఉద్దేశాలను తెలియజేశారు. మన రాష్ట్రంలో రైతు బజార్ల ఏర్పాటుకు బహుశా ఇదే ప్రేరణ కావచ్చు. అమెరికాలో అల్పాదాయ వర్గాల కల్పతరువు డాలర్ ట్రీ అనే వేలాది గొలుసు దుకాణాలు ఉండడం- వీటిలో ఏ వస్తువు అయినా ఒక డాలర్ కే దొరకడం వీటి ప్రత్యేకత.

సాగునీటి శాఖలో ఇంజనీర్ గా శ్రీధర్ , ప్రపంచంలోనే గొప్ప సివిల్ ఇంజనీరింగ్ నిర్మాణంగా ప్రసిద్ధి పొందిన హోవర్ డ్యాం ను, రెండవ ప్రపంచ యుద్ధంలో అమెరికాను ఆదుకున్న గ్రాండ్ కూలీ డ్యామ్ ను సందర్శించి వాటి నిర్మాణ విశేషాలు, వాటి వల్ల ఒనకూడిన ప్రయోజనాలను వివరించారు. అలాగే ఈ రెండు డ్యామ్ ల రూపకల్పనలో ప్రధాన పాత్ర పోషించిన ఎల్వుడ్ మీడ్ కృషిని ఆయన చేసిన సేవలను స్మరిస్తూ - ఆయన సమకాలికుడు హైదరాబాద్ రాజ్యంలో మంజీరా నదిపై నిజాంసాగర్ డ్యాం నిర్మించిన అలీ నవాజ్ జంగ్ చేసిన ప్రయోగాల గురించి తెలియజేయడం బాగుంది.

అమెరికా సంయుక్త రాష్ట్రాల పరిణామ క్రమం, అమెరికా అధ్యక్షులు, నల్లజాతి ప్రజల స్వేచ్ఛా ధామం బాల్టిమోర్, అమెరికా ఫెడరల్ రాజధాని వాషింగ్టన్ డిసి చరిత్ర పూర్వపరాలతో పాటు అది పర్యాటక కేంద్రంగా విలసిల్లిన విధానం తెలియజేశారు. ప్రకృతి సంపదకు నిలయమైన కొలరాడో రాష్ట్రం, ప్రపంచంలో అత్యున్నత జలపాతం నయాగరా, ఆస్టిన్ లో లిండన్ జాన్సన్ స్మారక గ్రంథాలయం, ప్రపంచ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కేంద్రం సుందర నగరం సియాటిల్ తో పాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యాప్ అమెజాన్ అలెక్సా గురించి ఆసక్తికరంగా వివరించారు. అలాగే అమెరికాలో హిందూ దేవాలయాల నిర్మాణ చరిత్ర గురించి కూడా తెలియజేశారు.

అమెరికాలో జీవితాలు ఎవరికి వారి యమునా తీరే అంటూనే ' అమెరికాలో బేబీ సిస్టర్స్ గా మారిన భారతీయ తల్లిదండ్రులు' ' అమెరికాకు ఎగిరిపోయిన పిల్లల ఒంటరి తల్లిదండ్రుల వెతల'ను చర్చించడం మనల్ని ఆలోచింపజేస్తుంది. అభివృద్ధి చెందిన దేశంగా చెప్పబడే అమెరికా ఎదుర్కొంటున్న నల్లుల బెడద గురించి వినడం ఆశ్చర్యంగానే ఉంటుంది. చివరగా అమెరికా ప్రజల నుంచి మనం నేర్చుకోవలసిన అంశాలతో పాటు, తృణీకరించాల్సిన విషయాల గురించి కూడా తెలియజేయడం బాగుంది. ఆసక్తికరమైన కథనాలతో పాటు, లోపల విస్తృతంగా ఇచ్చిన కలర్ ఫోటోలతో ,ఈ పుస్తకాన్ని అందంగా తీర్చిదిద్దడంలో రచయిత శ్రీధర్ రావు దేశ్ పాండే కృషి అభినందనీయం. ఇంటికొకరు అమెరికాకు పోతున్న ఈ రోజుల్లో ఇలాంటి పుస్తకాల అవసరం ఉన్నదా అని సంశయించే వాళ్లు కూడా, తమ అవగాహనను పెంచుకోవడానికి ఇవి ఉపయోగపడతాయని గమనించాలి.

("అమెరికా ముచ్చట్లు"
(అమెరికా పర్యటనానుభవాలు)
-శ్రీధర్ రావు దేశ్ పాండే.
వెన్నెల- గీత ప్రచురణలు.
వెల 250 రూపాయలు, పేజీలు 162.
ప్రతులకు: నవోదయ, 9491060585)



చిరస్మరణీయ అక్షర శిల్పులు

జి.ఎస్. వరదాచారి

జి.ఎస్. వరదాచారి (1932, అక్టోబరు 24 - 2022, నవంబరు 3) సీనియర్ తెలుగు భాషా సినీ విమర్శకుడు, పాత్రికేయుడు. 1988లో పదవీ విరమణ చేసేవరకు ఆంధ్రభూమి పత్రికకు సహ సంపాదకుడిగా ఉన్నారు.



వరదాచారి 1932, అక్టోబరు 24న నిజామాబాదు జిల్లాలోని ఆర్మూరులో జన్మించారు. నిజాం పాలనలో బాల్యమంతా గడిపిన వరదాచారి, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో డిగ్రీ, పి.జి. డిప్లమా ఇన్ జర్నలిజం చదివాడు. తరువాత కొంతకాలం 'ది హిందూ' పత్రికలో ఇంటర్న్‌షిప్ చేశారు.

'కృష్ణా పత్రిక'ను తొలిసారిగా చదివిన వరదాచారి ఆ పత్రికకు పాఠకుడయ్యారు. 1948లో ఆంధ్ర జనత పత్రికతో తన జర్నలిజం వృత్తిని ప్రారంభించారు. జర్నలిజం డిగ్రీతో ప్రవేశించిన అతికొద్ది మంది జర్నలిస్టులలో వరదాచారి ఒకరు. నాన్ ముల్కీ సంఘటనలు, ఆంధ్రప్రదేశ్ అవతరణ తరువాత జరిగిన చరిత్రకు ప్రత్యక్ష సాక్షిగా ఉన్న వరదాచారి రాసిన సంపాదక లేఖగా పంపిన 'స్వతంత్ర' అనే రచనను పత్రిక వ్యాసం రూపంలో ప్రచురించింది. అదే ఇతని తొలివ్యాసం. ఆంధ్రభూమి, ఈనాడు పత్రికల్లో జర్నలిస్టుగా పనిచేశారు. తెలుగు భాషోద్యమ సమాఖ్య ఉపాధ్యక్షుడిగా ప్రభుత్వంలో తెలుగు భాష వినియోగం కోసం పోరాడారు. తెలుగు విశ్వవిద్యాలయంలో జర్నలిజం విద్యార్థులకు పాఠాలు బోధించారు. పాత్రికేయరంగంలో తెలుగు విశ్వవిద్యాలయం నుండి గౌరవ డాక్టరేట్ అందుకున్నారు.

వరదాచారి జర్నలిజం కోర్సు పుస్తకాలు కూడా రాశారు. అనేక పుస్తకాలకు సంపాదకమండలి సభ్యుడిగా (పత్రికా పదకోశం) ఉన్నారు.ఆయన రచనల్లో...ఇలాగేనా రాయడం (2003), దిద్దుబాటు (2003), నార్ల వెంకటేశ్వరరావు (2009), మన పాత్రికేయ వెలుగులు (2010), జ్ఞాపకాల వరద (2017) మంచి ప్రాచుర్యాన్ని పొందాయి.
వరదాచారి 2022, నవంబరు 3న హైదరాబాదులో మరణించారు.



చిరస్మరణీయ అక్షర శిల్పులు

దేవులపల్లి కృష్ణశాస్త్రి

దేవులపల్లి కృష్ణశాస్త్రి (నవంబర్ 1, 1897 - ఫిబ్రవరి 24, 1980) తెలుగు కవి. తెలుగు భావ కవితా రంగంలో కృష్ణశాస్త్రి ఒక ముఖ్య అధ్యాయం. ఆయన రేడియాలో లలితగీతాలు, నాటికలు, సినిమాల్లో పాటలు రాయడం ద్వారా ప్రఖ్యాతి పొందారు. చిన్న వయసునుండే రచనలు ఆరంభించారు. 1929 లో రవీంద్రనాధ టాగూరును కలసిన తరువాత ఆయన కవిత్వంలో భావుకత వెల్లివిరిసింది. 1945లో ఆకాశవాణిలో చేరి అనేక పాటలు, నాటికలు రచించారు.

దేవులపల్లి కృష్ణశాస్త్రి తూర్పు గోదావరి జిల్లా, పిఠాపురం దగ్గరలోని చంద్రపాలెం అనే గ్రామంలో 1897 నవంబరు 1న జన్మించారు. అతని తండ్రి, పెదతండ్రి గొప్ప పండితులు. వారింట్లో నిరంతరం ఏదో సాహిత్యగోష్ఠి జరుగుతూ ఉండేది. కృష్ణశాస్త్రి చిన్న వయసునుండే రచనలు ఆరంభించారు. పిఠాపురం హైస్కూలులో అతని విద్యాభ్యాసం సాగింది. పాఠశాలలో తన గురువులు కూచి నరసింహం, రఘుపతి వెంకటరత్నం ఆంగ్ల సాహిత్యంలో తనకు అభిరుచి కల్పించారని దేవులపల్లి చెప్పుకొన్నారు. 1918లో విజయనగరం వెళ్ళి డిగ్రీ పూర్తి చేసి తిరిగి కాకినాడ పట్టణం చేరారు. పెద్దాపురం మిషన్ హైస్కూలులో ఉపాధ్యాయవృత్తి చేపట్టారు.

ఆ కాలంలో వ్యావహారిక భాషావాదం, బ్రహ్మసమాజం వంటి ఉద్యమాలు ప్రబలంగా ఉన్నాయి. కృష్ణశాస్త్రి తన అధ్యాపకవృత్తిని వదలి బ్రహ్మసమాజంలో చురుకుగా పాల్గొన్నారు. అదే సమయంలో సాహితీ వ్యాసంగం కూడా కొనసాగించారు. 1920లో వైద్యంకోసం రైలులో బళ్ళారి వెళుతూండగా ప్రకృతినుండి లభించిన ప్రేరణ కారణంగా "కృష్ణపక్షం కావ్యం" రూపు దిద్దుకొంది. 1922లో భార్యా వియోగానంతరం ఆయన రచనలలో విషాదం అధికమయ్యింది.

తరువాత మళ్ళీ వివాహం చేసుకొని, పిఠాపురం హైస్కూలులో అధ్యాపకునిగా చేరారు. కాని పిఠాపురం రాజుగారికి కృష్ణశాస్త్రి భావాలు నచ్చలేదు. కృష్ణశాస్త్రి ఆ ఉద్యోగం వదలి బ్రహ్మసమాజంలోను, నవ్య సాహితీసమితిలోను సభ్యునిగా, భావ కవిత్వోద్యమ ప్రవర్తకునిగా దేశమంతటా ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సమయంలో ఎందరో కవులతోను, పండితులతోను పరిచయాలు కలిగాయి. ప్రాచ్య, పాశ్చాత్య సాహిత్యాన్ని అధ్యయనం చేశారు. పిఠాపురంలోని హరిజన వసతి గృహంతో సంబంధం ఏర్పరచుకొని హరిజనోద్ధరణ కార్యక్రమాలలో పాల్గొన్నందున బంధువులు అతనిని వెలివేశారు. అయినా వెనుకాడని కృష్ణశాస్త్రి వేశ్యావివాహ సంస్థను ఏర్పాటు చేసి ఎందరో కళావంతులకు వివాహాలు నిర్వహించారు. సంఘ సంస్కరణా కార్యక్రమాలు నిర్వహిస్తూనే "ఊర్వశి" అనే కావ్యం వ్రాశారు.

1929లో విశ్వకవి రవీంద్రనాధ టాగూరుతో పరిచయం ఏర్పడింది. వారిద్దరి మధ్య సాహితీ సంబంధాలు ఏర్పడ్డాయి. 1933-41 మధ్య కాలంలో కాకినాడ కాలేజీలో తిరిగి అధ్యాపకవృత్తిని చేపట్టారు. 1942లో బి.ఎన్.రెడ్డి ప్రోత్సాహంతో మల్లీశ్వరి చిత్రానికి పాటలు వ్రాశారు. తరువాత అనేక చిత్రాలకు సాహిత్యం అందించారు. 1957లో ఆకాశవాణిలో

చేరి తెలుగు సాహిత్య ప్రయోక్తగా అనేక గేయాలు, నాటికలు, ప్రసంగాలు అందించారు.

భావ కవిగా, 'ఆంధ్రా షెల్లీ 'గా ప్రసిద్ధులైన దేవులపల్లి వేంకట కృష్ణశాస్త్రి... బి.ఎన్.రెడ్డి ప్రోత్సాహంతో 'మల్లీశ్వరి (1951)'తో చిత్రరంగంలో అడుగుపెట్టారు. సినిమా పాటకు కావ్య గౌరవం కలిగించారు. ఆపాత మధురమైన కృష్ణశాస్త్రి సాహిత్యం ఇక్షురసార్ణవం వంటిదని శ్రీశ్రీ శ్లాఘించారు. లాలిత్యం, సారళ్యం, ప్రకృతి సౌందర్యం - కృష్ణశాస్త్రి పాటల్లోని ప్రధాన లక్షణాలు. భావోద్వేగాలకు, హృదయ స్పందనలకు అక్షర రూపమిచ్చి భావ కవితలంత సుకుమారంగా ప్రణయ విరహ గీతాల్ని రాసిన కవి. ఆత్మ నివేదన, ఆరాధన గల భక్తిగీతాలు కూడా అనేకం. రాజమకుటం, సుఖదుఃఖాలు, కలిసిన మనసులు, అమెరికా అమ్మాయి, గోరింటాకు మొదలైన చిత్రాల్లో 170 పాటలు మాత్రమే రాసిన కృష్ణశాస్త్రి, ఈ పన్నెండుగురు పద నిర్దేశకుల్లోనూ తక్కువ పాటలు రాసిన కవి.

రచనలు:
కృష్ణ పక్షము, ప్రవాసము, ఊర్వశి కావ్యము, అమృతవీణ - 1992 - గేయమాలిక, అమూల్యాభిప్రాయాలు - వ్యాసావళి,
బహుకాల దర్శనం - నాటికలు, కథలు, ధనుర్దాసు - నాలుగు నాటికలు, కృష్ణశాస్త్రి వ్యాసావళి - 4 భాగాలు, మంగళకాహళి - దేశభక్తి గీతాలు, శర్మిష్ఠ - 6 శ్రవ్య (రేడియో) నాటికలు, ఆండాళ్ళు తిరుప్పావు కీర్తనలు, నాటిక 1993, మేఘమాల - సినిమా పాటల సంకలనం - 1996, శ్రీ విద్యావతి - శృంగార నాటికలు, యక్షగానాలు - అతిథిశాల - సంగీత రూపకాలు, మహతి, వెండితెర పాటలు.

గొప్ప వక్తగా, రచయితగా, భావకవుల ప్రతినిధిగా పేరుపొందిన కృష్ణశాస్త్రి గొంతు 1963లో అనారోగ్యకారణంగా మూగవోయింది. కాని ఆయన రచనా పరంపర కొనసాగింది. ఆయన కి అనేక సన్మానాలు ప్రశంసలు లభించాయి. 1980 ఫిబ్రవరి 24న కృష్ణశాస్త్రి మరణించారు.

చిరస్మరణీయ అక్షర శిల్పులు

వట్టికోట ఆళ్వారుస్వామి

వట్టికోట ఆళ్వారుస్వామి (1915 నవంబరు 1 - 1961 ఫిబ్రవరి 5) తెలంగాణ ప్రజాసాహిత్యానికి పాదులు వేసి ప్రాణం పోసినవారు. ఆయన రచయిత, సేవాశీలి, ఉద్యమకర్త, కమ్యూనిస్టు నేత, ప్రచురణకర్త, పాత్రికేయుడు, ప్రచారకుడు. భాషాసాహిత్యాల దగ్గర్నుంచి పౌరహక్కుల దాకా వట్టికోట అన్ని ఉద్యమాల్లో పాలుపంచుకున్నారు. తెలుగులో రాజకీయ నవలలకు ఆద్యుడు. తెలంగాణా ప్రాంతంలో గ్రంథాలయోద్యమం నడిపించి ప్రజలను తమ అక్షరానికి పదును పెట్టడం ద్వారా చైతన్య పరిచారు.

1915 నవంబర్ 1వ తేదీన నల్లగొండ జిల్లా నకిరేకల్ సమీపంలోని చెరువు మాదారంలో సింహాద్రమ్మ, రామచంద్రాచార్యులకు జన్మించారు. తండ్రి చిన్ననాట చనిపోవడంతో సీతారామారావు అనే ఉపాధ్యాయుడికి వండిపెడుతూ విద్యాభ్యాసం, సారస్వతాభ్యాసం చేశారు. ఉర్దూ, తెలుగు, ఇంగ్లీషు స్వయంగా నేర్చుకున్నారు.

హోటల్ కార్మికుడిగా జీవితం ప్రారంభించిన ఆయన స్వయంగా చదువు నేర్చుకుని, రచయిత్రై, ప్రచురణ కర్త అయ్యారు. వంటపనిలో, ప్రూఫ్ రీడింగ్‌లో, హోటల్ సర్వర్‌గా పనిచేస్తున్నప్పుడు ఆయన పొందిన అనుభవాలు ఆయన ప్రజల మనిషిగా నిలబడేట్టు చేశాయి. గ్రంథాలయోద్యమంతో మొదలైన ప్రేరణ ఆళ్వారుస్వామిని నిజాం వ్యతిరేకోద్యమం దాకా నడిపించింది. ప్రజల్లో కలిసి ఆయన పనిచేసిన తీరు నిజాంకు కోపం తెప్పించింది. దానితో ఆయన జైలు పాలు అయ్యారు.



1941 నుంచి రచనా వ్యాసంగాన్ని చేపట్టిన వట్టికోట రచనలు గోల్కొండ, మీజాన్, ఆంధ్రకేసరి, గుమస్తా, స్రవంతి వంటి పత్రికలలో ప్రచురితమయ్యేవి. తెలంగాణా లో అభ్యుదయ రచయితల సంఘం ఏర్పాటుకు కృషి చేసారు. వట్టికోట జైలు జీవితం జైలు లోపల పేరుతో కథల సంపుటిగా వెలువడింది. తెలంగాణ ప్రజాజీవిత నేపథ్యంతో 1952లో ప్రజల మనిషి నవల రాశారు.

కనువిప్పు నాటికతోపాటు 14 ఏకాంకిలు రచించారు. వట్టికోట ధర్మరాజు అను కలం పేరుతో కూడా కొన్ని రచనలు చేశారు. కాళోజి నా గొడవ స్ఫూర్తితో రామప్ప రభస రచించారు. ఊరూరా తిరిగి రచనలు, కవిత్వము సేకరించేవారు.

1940-45 మధ్యకాలంలోని రాజకీయ, సాంఘిక ప్రజా ఉద్యమాల చిత్రణతో గంగు నవల రాశారు.

తెలంగాణ చైతన్యం కోసం 'దేశోద్ధారక గ్రంథమాల' స్థాపించి 35 పుస్తకాలు ప్రచురించారు.

ఆళ్వారు స్వామి చదువు మధ్యలో ఆపేసి గ్రంథాలయోద్యమంలో కొనసాగాడు. తెలంగాణా ప్రాంతంలో అప్పటికి పట్టణ ప్రాంతాలలో 100 సంవత్సరాలు దాటిన అనేక గ్రంధాలయాలున్నాయి. ఆళ్వారు గ్రామీణ గ్రంధాలయాలు, సంచార గ్రంధాలయాలు స్థాపించాడు. గ్రామీణ ప్రజలకు పుస్తకాలందించడం కోసం తలమీద తట్టలో పుస్తకాలు పెట్టుకుని ఊరూరా తిరిగి వారికి ఆధునిక సాహిత్యాన్ని అందుబాటులోకి తెచ్చారు. దేశోద్ధారక రిఫరెన్స్ గ్రంధాలయం స్థాపించి పాత పత్రికలూ సంచికలు పరిశోధకులకు అందుబాటులో ఉంచారు. పత్రికా పరిజ్ఞానం ఉండడము వలన సురవరం ప్రతాప రెడ్డి హైదరాబాద్ లో స్థాపించిన "గోలకొండ" పత్రిక లో ప్రూఫ్ రీడర్ గా పని చేసాడు. గ్రంధాలు రాయడం, ప్రచురించడం, విక్రయించడం, ప్రచారం చేయడం వంటి ఇతనికి నిత్యకృత్యం అవడం తో మిత్రులు ఇతనిని సంచార గ్రంధాలయంగా అభివర్ణించే వారు. 1961 ఫిబ్రవరి 5న ఆళ్వారు స్వామి మరణించారు. ***************